క్లుప్తంగా

వెంకన్నపేటలో ఎన్‌ఎస్‌ఎస్ సేవాశిబిరం



పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

దెంకాడ: మండలంలోని అమకాం పంచాయతీ వెంకన్నపేట గ్రామంలో వారం రోజుల పాటు సేవా కార్యక్రమాలు, ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల స్టూడెంట్ డీన్ ఎస్.మోహన్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ పీవో ఎన్.షణ్ముఖరావు తెలిపారు. మంగళవారం గ్రామ వీధులను శుభ్రం చేయించడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించారు. వారం రోజుల పాటు చిరుధాన్యాల సాగు, యోగా, ఫిట్‌నెస్, ఆధునిక వ్యవసాయం, ఈ-ఎడ్యుకేషన్, ఈ-మెడిసిన్ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



మజ్జిగ సరఫరా చేస్తున్న బంగారమ్మ

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొండవెలగాడ గ్రామంలో చలివేంద్రాన్ని ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పెరుగుతున్న ఎండల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. వడ దెబ్బబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మొత్తం వెయ్యి మందికి మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి పూర్తయ్యే వరకు చలివేంద్రం కొనసాగించనున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వాకింగ్ ట్రాక్ ప్రారంభం



వాకింగ్ ట్రాక్ పరిసరాలను పరిశీలిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి, తదితరులు

విజయనగరం: నగరంలోని అయ్యన్నపేట కోమటిచెరువు వద్ద వాకింగ్ ట్రాక్ చుట్టూ ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. కోమటి చెరువు ప్రాంతాన్ని ఇప్పటికే అన్ని విధాలా అభివృద్ధి చేశారు. రూ.13.60 లక్షలతో బండ్ ఫార్మేషన్, వాకింగ్ ట్రాక్, ప్రధాన గేటు, విద్యుత్ స్తంభాలు, లైట్లు వంటివి ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జ్ డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, స్థానిక కార్పొరేటర్ పిన్నింటి కళావతి, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, ఈఈ కె.శ్రీనివాసరావు, డీఈ అప్పారావు, ఏఈ శ్రీనివాసరావు, స్థానిక నాయకులు దూబే, సైలాడ సత్యనారాయణ, పిన్నింటి సూర్యనారాయణ, లంక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్షణగోడ నిర్మాణం



పనులు పరిశీలిస్తున్న పీఏసీఎస్ అధ్యక్షుడు కనకసింహాచలం, తదితరులు

దెంకాడ: మండల కేంద్రమైన దెంకాడ మార్కెట్ వద్ద ప్రమాదకరంగా ఉన్న సాగునీటి కాలువ పనులు ఎట్టకేలకు ప్రారంభించారు. చాలా ఏళ్ల క్రితం కాలువ ప్రధాన గోడ శిథిలమైంది. అయినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. ఈ ప్రాంతంలోని బీసీ కాలనీ, ఎస్సీ కాలనీ, చిన్నవీధి, ఇతర వీధులకు చెందిన ప్రజలు ఈ కాలువకు ఆనుకుని ప్రధాన రహదారి మీదుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇదే మార్గంలో స్టేట్‌బ్యాంక్ కూడా ఉండడంతో నిత్యం వాహనదారులతో రద్దీగా ఉంటుంది. కాలువకు రక్షణ గోడ లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు భయపడేవారు. గతంలో ఆటో అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయిన ఘటన చోటుచేసుకుంది. అయితే ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కాలువకు రక్షణగోడ నిర్మాణం చేపడుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, సర్పంచ్ పతివాడ గౌరి తదితరులు పనులను పరిశీలించారు.

ఎమ్మెల్సీ సురేష్‌బాబుకు ఘన స్వాగతం

- రెండోసారి ప్రమాణ స్వీకారం తర్వాత తొలిసారిగా స్వగ్రామానికి రాక
- బైక్‌లు, కార్లతో భారీ ర్యాలీగా అభిమానుల ఊరేగింపు



ఎమ్మెల్సీని గజమాలతో సత్కరిస్తున్న హర్షవర్ధన్‌రాజు

విజయనగరం: ఎమ్మెల్సీగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేశాక మొదటిసారిగా జిల్లాకు వచ్చిన డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణరాజుకు జిల్లా కేంద్రంలో ఘన స్వాగతం లభించింది. నగరంలోని వై జంక్షన్ వద్దకు చేరుకున్న ఆయనకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, యువ నాయకుడు కె.హర్షవర్ధన్‌రాజు, పార్టీ నాయకులు, జి.సూరపరాజు తదితరులు పూలామలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అనంతరం అక్కడి నుంచి కార్లు, బైక్‌లతో ర్యాలీగా బయలుదేరి నగరంలోని ప్రధాన మార్గం గుండా నెల్లిమర్ల మండలంలోని తన స్వగ్రామమైన మొయిద విజయరామపురం వెళ్లారు.

నెల్లిమర్ల: శాసన మండలి సభ్యుడిగా రెండోసారి ఎన్నికైన తర్వాత మంగళవారం తొలిసారిగా స్వగ్రామం మొయిద విజయరాంపురం వచ్చిన డాక్టర్ పీవీవీ సూర్యనారాయణరాజు(సురేష్‌బాబు)కు ఘన స్వాగతం లభించింది. పార్టీ శ్రేణులు, అభిమానులు ఆయనకు ఘనంగా సత్కరించారు. స్థానిక మిమ్స్ జంక్షన్ వద్ద పెద్ద ఎత్తున పార్టీశ్రేణులు, అభిమానులు మేళతాళాలతో స్వాగతం పలికారు. అక్కడ నుంచి బైక్‌లు, కార్లతో ర్యాలీగా బయలుదేరారు. పట్టణంలోని స్టేట్ బ్యాంకు జంక్షన్‌లో వైఎస్సార్‌సీపీ యూత్ లీడర్ కె.హర్షవర్ధన్‌రాజు ఎమ్మెల్సీకి గజమాలతో సత్కరించారు. పార్టీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావుతో పాటు వైస్ చైర్మన్ కారుకొండ వెంకట కృష్ణారావు,



దివంగత వైఎస్ విగ్రహానికి పూలమాల వేస్తున్న సురేష్‌బాబు

ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపకుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి, పార్టీ సీనియర్ నాయకుడు మంత్రి వెంకటరమణ తదితరులు ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలియజేశారు. మొయిద గ్రామానికి చేరుకున్న సురేష్‌బాబు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పలాస నియోజకవర్గ పరిశీలకుడు కేవీ సూర్యనారాయణరాజు, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం, పార్టీ మండలశాఖ అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, గ్రామ సర్పంచ్ అట్టాడ కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు పెనుమత్స సంతోష్‌బాబు తదితరులు సురేష్‌బాబుకు ఘనంగా సత్కరించారు. గ్రామస్థులు ఊరంతా మేళతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రెండోసారి ఎమ్మెల్సీగా తనకు అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి, పార్టీని మరింత బలోపేతం చేయడానికి తనవంతు కృషిచేస్తానన్నారు.

ప్రతీ గడపలో సంక్షేమ సంతోషం



సంక్షేమ పథకాల లబ్ధిని వివరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగరంలోని 44వ డివిజన్ పరిధి అయ్యన్నపేట, చెంచుల కాలనీ, తదితర ప్రాంతాల్లో 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, స్థానిక నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.. పథకాలు సక్రమంగా అందుతున్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పనితీరు ఎలా ఉందని అడగగా.. బాగుందని ప్రతి ఒక్కరూ బదులిచ్చారు. ఈ సందర్భంగా పలువురు డ్రైనేజీ, విద్యుత్ దీపాలు, సీసీరోడ్లు తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా.. అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, జోనల్ ఇన్‌ఛార్జి తమ్ము, డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతీదేవి, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, జోనల్ ఇన్‌ఛార్జి దూబే, వైఎస్సార్‌సీపీ నాయకులు సైలాడ సత్యనారాయణ, డివిజన్ అధ్యక్షుడు లంక మహేష్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురికీ సేవ చేయడం గొప్ప అదృష్టం

- నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి



పేదలకు నిత్యావసరాలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్న కోలగట్ల శ్రావణి

విజయనగరం:

మనసుకు సంతోషం కలగాలంటే నచ్చిన పని చేయాలని.. చాలా తక్కువ మంది ఇతరులకు సేవ చేయడం తమ ఆనందంగా భావిస్తారని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. మాతృదేవోభవ ట్రస్ట్ 11వ వార్షికోత్సవం సందర్భంగా నిరుపేదలకు, పేద విద్యార్థులకు రూ.1.36 లక్షల విలువైన నిత్యావసరాల సరుకులు, ఆర్థిక సాయం పంపిణీ కార్యక్రమాన్ని ఆనంద గజపతి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రావణి చేతులమీదుగా పేదలకు నిత్యావసరాలు, దుప్పట్లు, విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మనం సంపాదించిన దాంట్లో కొంత మొత్తాన్ని నలుగురికీ ఉపయోగపడేలా చూస్తే తిరిగి ఏదో విధంగా ఆ ఫలం మనకు దక్కుతుందన్నారు. పేదల కనీస అవసరాలు తీర్చేందుకు కృషిచేస్తున్న మాతృదేవోభవ ట్రస్టు సేవలను ప్రశంసించారు. ఇటువంటి సేవా కార్యక్రమాలకు కోలగట్ల కుటుంబం ఎప్పుడూ సంపూర్ణ సహకారం అందిస్తుందని, ఏ అవసరం వచ్చినా తమను సంప్రదించవచ్చని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపకులు డోల చిరంజీవిరావు, ఈపీడీసీఎల్ అధికారి లక్ష్మణరావు, సురేష్, బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆకలి తీర్చడం దైవసేవతో సమానం

- ఎస్‌బీఐ ఏజీఎం జె.శ్రీనివాసరావు



పేదలకు ఆహారాన్ని వడ్డిస్తున్న ఎస్‌బీఐ ఏజీఎం జె.శ్రీనివాసరావు

విజయనగరం: ఆకలితో ఉన్న పేదలను ఆదుకోవడం దేవుని సేవతో సమానమని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏజీఎం జె.శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ఎన్‌సీఎస్ థియేటర్ జంక్షన్ వద్ద ఉన్న ఫుడ్ బ్యాంక్‌ను మంగళవారం సందర్శించి పేదలకు ఆహారాన్ని వడ్డించారు. గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో 537 రోజులుగా పేదలకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. నగరంలో పేదలకు ఉచితంగా ఆహారాన్ని అందించాలన్న ఆలోచనను ఆచరణ సాధ్యం చేసి చూపిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఐదు ఫుడ్ బ్యాంకుల ద్వారా రోజుకు 800 మంది వరకు పేదలకు ఆహారాన్ని అందించడం గొప్ప విషయం అన్నారు. కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి కనిశెట్టి సుధాకర్, అధ్యక్షుడు కాండ్రేగుల శేఖర్, గవర కార్పొరేషన్ డైరెక్టర్ ఆడారి రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ప్రభుత్వం



నాగోజీపేటలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల, మేయర్ విజయలక్ష్మి తదితరులు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- నాగోజీపేలో ఇళ్ల పట్టాల పంపిణీ

విజయనగరం: ఆరు దశాబ్దాల నాటి కల సాకారమైంది. తాము ఉంటున్న ప్రాంతంలోనే ఇళ్ల పట్టాలు మంజూరు చేయడంతో నగరంలోని నాగోజీపేట ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేశారు. 25వ డివిజన్ నాగోజీపేటలో 47 మంది పేదలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మంగళవారం ఇళ్ల పట్టాలు అందజేశారు. పట్టాలు అందుకున్నవారంతా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నాగోజీపేటలో పట్టాలు లేనివారికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. గత పాలకులు పట్టాలిస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్నారు కానీ గెలిచాక పేదల కష్టాలను పట్టించుకోకుండా గాలికొదిలేశారని అన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాల్లో, పట్టణాల్లో మౌలిక వసతులు కల్పించామన్నారు. ఎన్నికల సమయంలోనే మాత్రమే కనిపించే వారిని కాకుండా నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్న వారిని గెలిపించుకోవాలని కోరారు. మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మాట తప్పని మాడమ తిప్పని నేతలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కోలగట్ల వీరభద్రస్వామి మనకు అండగా ఉండడం మనందరి అదృష్టమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు, తహసీల్దార్ బంగారురాజు, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, జోనల్ ఇన్‌ఛార్జి బోడసింగి ఈశ్వరరావు, కార్పొరేటర్ జీవీ రంగారావు, యాదవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇసరపు శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు యడ్ల రాజేష్, డివిజన్ అధ్యక్షుడు గొట్టముక్కల మురళి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం ఫూల్‌బాగ్: నగరంలోని ఫూల్‌బాగ్ ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ అంధుల ఆశ్రమ పాఠశాలలో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎం.మహేశ్వరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 8వ తరగతి వరకు 41 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. 5 సంవత్సరాలకు పైబడి వయస్సు ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, సదరం సర్టిఫికెట్, మూడు పాస్‌పోర్టు సైజు ఫోటోలను జతచేయాల్సి ఉంటుంది. వివరాలకు 9494914959, 8317548039 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

ఆకట్టుకున్న గాత్ర కచేరీ

విజయనగరం టౌన్: స్థానిక మహారాజా ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల ఆవరణంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన గాత్ర కచేరీ అలరించింది. గాత్ర సహాయ అధ్యాపకులు టి.దేవీసుజాత తన గాత్రంతో ఆకట్టుకున్నారు. వయోలెన్‌పై హెచ్.రామ చరణ్, మృదంగంపై పి.సురేష్‌కుమార్ సహకారం అందించారు.

కోలగట్లకు ఎండీఎం కార్మికుల కృతజ్ఞత



కోలగట్లను సత్కరిస్తున్న ఎండీఎం నిర్వాహకుల సంఘం ప్రతినిధులు

విజయనగరం: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జిల్లాలోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు మంగళవారం కోలగట్లను ఆయన నివాసం వద్ద కలిసి సత్కరించారు. ఇస్కాన్ సంస్థ నుంచి వంట బాధ్యతలను తిరిగి తమకు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పలు పెండింగ్ సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చి వారి పరిష్కారానికి చొరవచూపాలని కోరారు. కోలగట్ల స్పందిస్తూ.. ఆయా సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తానని అన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం అధ్యక్షుడు ఎం.మురళీధరరావు, కోశాధికారి పెంకి లక్ష్మి, ప్రధాన కార్యదర్శి స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ కుటుంబానికి అండగా ఉంటాం

విజయనగరం: క్రికెట్ ఆడుతుండగా.. ప్రమాదవశాత్తు పిడుగుపాటుకు గురై మృతి చెందిన గాజులరేగకు చెందిన పి.ఇజ్రాయిల్(21) కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి భరోసా ఇచ్చారు. మంగళవారం ఇజ్రాయిల్ మృతదేహాన్ని కొత్తపేట స్వర్గధామానికి కుటుంబ సభ్యులు, స్నేహితులు భారీ ర్యాలీగా తీసుకొచ్చారు. అక్కడకు చేరుకున్న కోలగట్ల.. ఇజ్రాయిల్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. అంత్యక్రియలకు కావాల్సిన ఏర్పాట్లు దగ్గరుండి చేయాలని పార్టీ నాయకులకు సూచించారు.

మలేరియాను నిర్మూలిద్దాం



విజయనగరం పట్టణంలో అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది



నెల్లిమర్ల రూరల్: సతివాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య, ఆరోగ్య సిబ్బంది



పూసపాటిరేగ: మలేరియా నియంత్రణపై చైతన్యర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది



విజయనగరం రూరల్: రాకోడులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి జగదీష్, సిబ్బంది

విజయనగరం ఫోర్ట్, పూసపాటిరేగ, నెల్లిమర్ల రూరల్: పరిసరాల పరిశుభ్రత పాటించి మలేరియాను నిర్మూలిద్దామని జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ ఎం. తులసి పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా నివారణ దినం సందర్భంగా విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం నుంచి గంటస్తంభం వరకు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దోమతెరలు వినియోగించాలని సూచించారు. పాత్రలలో రోజుల తరబడి నీరు నిల్వ ఉంచరాదన్నారు. కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు పాల్గొన్నారు. అదేవిధంగా పూసపాటిరేగ, నెల్లిమర్ల మండలాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది మలేరియా నివారణపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

బయాలజీ ఉపాధ్యాయుల ఫోరం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గం

విజయనగరం ఫూల్‌బాగ్: జీవశాస్త్ర ఉపాధ్యాయులు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. విజయనగరం జిల్లా బయాలజీ ఉపాధ్యాయుల ఫోరం కార్యవర్గ సమావేశం స్థానిక కోటలోని ఎంఆర్ హైస్కూల్‌లో మంగళవారం జరిగింది. అనంతరం బయాలజీ ఫోరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర పరిశీలకులు వి.సత్యారావు ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా ఎం.కృష్ణారావు, గౌరవ సలహాదారులుగా బి.వేణుగోపాలరావు, అధ్యక్షుడిగా జి.సన్యాసినాయుడు, ప్రధాన కార్యదర్శిగా ఎ.సురేంద్రనాద్, ఉపాధ్యక్షుడిగా ఎం.అమర్‌నాద్, కార్యదర్శులుగా సీహెచ్ సుజాత, ఇ.అప్పలరాజు, కోశాధికారిగా జి.అర్జునరావు, సంయుక్త కార్యదర్శిగా డి.మీనాకుమారి, తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈఓ ఎస్.టి.నాయుడు, డీసీఈబీ కార్యదర్శి టి.సన్యాసిరాజు తదితరులు పాల్గొన్నారు.

రామానుజాచార్యులకు ప్రత్యేక పూజలు



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: భారతీయ తత్త్వదర్శన కేంద్రం శ్రీక్షేత్రమ్‌లోని అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి దేవాలయంలో కొలువై ఉన్న శ్రీరామానుజాచార్యులు స్వామివారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరు నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామికి ఆలయ అర్చకులు పంచామృత తిరుమంజనం పూజలు చేశారు. దేవాలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో ముత్యాలమ్మ అమ్మవారు

విజయనగరం టౌన్: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి తోటపాలెం ముత్యాలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. భక్తులు వేకువజాము నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ ట్రస్ట్ ప్రతినిధులు శంకరరావు ఆధ్వర్యంలో అమ్మవారికి విశిష్ట పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారిని పెన్నులతో అలంకరించారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణలో ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు.